ఏ మాత్రం నలతగా ఉన్నా అందరం ఆసుపత్రికి వెళ్లిపోతాం. వైద్యుడు వివరాలడిగి చిన్న చీటి మన చేతిలో పెడతాడు. ఆ బ్రహ్మరాతని సునాయాసంగా చదివేసి ఎలాంటి పొరపాటు లేకుండా మందులిచ్చే వాళ్లే ఫార్మసిస్ట్‌లు. అందరి ఆరోగ్యరక్షణే పరమావధిగా పనిచేసే ఈ ఫార్మసీ రంగంలోకి ప్రవేశించాలంటే కొన్ని కోర్సులు చేయాలి. హెల్త్‌కేర్‌కి సంబంధించి వివిధ విభాగాల్లో ఈ నిపుణులకు ఎప్పటికీ తరగని డిమాండ్ ఉంటోంది.

డీ-ఫార్మసీ

ఇది రెండు సంవత్సరాల వ్యవధి ఉన్న కోర్సు. ఇందులో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటిక్స్, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ ఫార్మసీ, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, డ్రగ్‌స్టోర్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాలపై మౌలిక అవగాహన కల్పిస్తారు. కోర్సు పూర్తి అయిన తర్వాత 500 గంటలు హాస్పిటల్‌లోని డిస్పెన్సరీల్లో శిక్షణను తీసుకోవాలి. తర్వాత రాష్ట్ర ఔషధ సంఘంలో పేరును నమోదు చేసుకొని రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్‌గా అర్హత పొందవచ్చు. దీంతో వీరికి హాస్పిటల్ ఫార్మసిస్ట్, రిటైల్ ఫార్మసిస్ట్, మెడికల్ రిప్రజెంటేటివ్, హోల్‌సేల్ డీలర్; మాన్యుఫ్యాక్చరింగ్ కెమిస్ట్ ఫర్ కాస్మటిక్స్, రీ ప్యాకింగ్ ఆఫ్ డ్రగ్స్, కమ్యూనిటీ ఫార్మసిస్ట్ లాంటి ఉద్యోగాలు ఉంటాయి. దేశం మొత్తం మీద 564 కళాశాలల్లో ఈ కోర్సు ఉంది. వీటిలో 42 కళాశాలలు ఆంధ్రప్రదేశ్‌లో, 26 తెలంగాణలో ఉన్నాయి.

డీ ఫార్మసీ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఈసీఈటీ (ఈ సెట్) పరీక్షలో ఉత్తీర్ణత పొంది రెండో సంవత్సరం బీ-ఫార్మసీ కోర్సులో లేదా ఫార్మా-డీలో చేరవచ్చు. వీరికి 10 శాతం సీట్లను కేటాయిస్తారు.

రమ్మంటోంది.. ఔషధరంగం!

కెరియర్ గైడెన్స్ - ఫార్మసీ

ఆత్యంత ప్రాచీనమైన ఔషధ శాస్త్రాన్ని ఉపయోగించి పూర్వ కాలంలో వైద్యులు తమ సొంత మందు చీటీలను తయారు చేసుకునేవారు. తర్వాత కాలక్రమేణా దీన్ని వైద్య శాస్త్రానికి అనుసంధానించడంతో ఔషధ నిపుణుల (ఫార్మసిస్ట్) అవసరం ఏర్పడింది. తయారుచేసిన ఔషధాలను ఫార్మసిస్ట్ ద్వారా వైద్యులకు, రోగులకు చేర్చాలనేది తప్పనిసరి నిబంధన. ఈ నేపథ్యంలో ఫార్మసిస్ట్‌లకు డిమాండ్ పెరిగింది.

డాక్టర్ కె. పద్మలత
విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ ఉమెన్, విజయవాడ.

ఫార్మసీ విద్యను అభ్యసించడానికి మొదటగా కళాశాల ఎంపిక అత్యంత ప్రధానం. ఈ విద్యనందించే కళాశాలలు ఏఐసీటీఈ, పీసీఐ ద్వారా గుర్తింపు పొంది ఉండాలి. ఎంపీసీ లేదా బైపీసీ గ్రూపులతో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఫార్మసీ విద్యలో చేరడానికి అర్హులు. కళాశాలల్లో 50 శాతం సీట్లు మొదట ఎంపీసీ చదివిన విద్యార్థులకు, మిగిలిన 50 శాతం బైపీసీవారికి కేటాయిస్తారు. ఇంటర్‌లో పొందిన మార్కుల ఆధారంగా డీఫార్మసీ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఈ ప్రకటన సాధారణంగా జూన్ చివరి వారంలో వస్తుంది. మిగిలిన రెండు కోర్సులకు ఇంటర్‌తోపాటు ఎంసెట్‌లో అర్హత పొంది ఉండాలి.

విద్యార్థి తన ఆసక్తిని బట్టి ఫార్మసీలో ఈ కింది మూడు కోర్సుల్లో ఎందులోనైనా చేరవచ్చు.

◗ డిప్లొమా ఇన్ ఫార్మసీ - 2 సంవత్సరాలు ◗ బ్యాచిలర్ ఇన్ ఫార్మసీ - 4 సంవత్సరాలు ◗ డాక్టర్ ఇన్ ఫార్మసీ - 6 సంవత్సరాలు

ఫార్మా - డీ

ఇది 6 సంవత్సరాల కోర్సు. ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా బైపీసీలో 50 శాతం మార్కులు కనీస విద్యార్హత. ప్రతి కళాశాలలో దీనికి 30 సీట్లు మాత్రమే ఉంటాయి. ఈ విద్యార్థులకు హాస్పిటల్, క్లినికల్, రోగ సంబంధిత విషయాలపై అవగాహన కల్పిస్తారు. వీరికి విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి. 2008 నుంచి విదేశీ ఉద్యోగాలకు అనుగుణంగా ఈ కోర్సును మన దేశంలో ప్రారంభించారు. ఇది ఉన్న ప్రతి కళాశాల టీచింగ్ హాస్పిటల్‌కు గానీ, ప్రాక్టీస్ సంబంధిత హాస్పిటల్‌కు గానీ అనుసంధానమై ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 58, తెలంగాణలో దాదాపు 63 కళాశాలల్లో ఈ కోర్సు అందిస్తున్నారు.

ఈ కోర్సు విద్యార్థులకు అనాటమీ, ఫిజియోలజీ, పాథోఫిజియోలజీ, ఫార్మాకో-థెరప్యూటిక్స్ వంటి సబ్జెక్టులపై మంచి పట్టును పెంచుతుంది. వీరు రెండో సంవత్సరం నుంచే హాస్పిటల్‌ను సందర్శిస్తారు. రోగుల సమస్యలపై అవగాహన పొందుతారు. తర్వాత ఆరో సంవత్సరంలో పూర్తిగా హాస్పిటల్‌లో ఉండి మెడికల్ డాక్టర్స్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తారు. రెగ్యులేటరీ సంస్థల్లో కూడా ఈ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. కమ్యూనిటీ ఫార్మసీ, హాస్పిటల్ ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీ విభాగాల్లో కూడా ఉద్యోగాలు ఉంటాయి.

ఉద్యోగాలు: ఈ కోర్సు చేసిన విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసిన విభాగాన్ని బట్టి న్యూక్లియర్ ఫార్మసిస్ట్, పిడియాట్రిక్ ఫార్మసిస్ట్, అంకాలజీ ఫార్మసిస్ట్, జీరియాట్రిక్ ఫార్మసిస్ట్, వెటర్నరీ ఫార్మసిస్ట్, న్యూట్రిషనల్ సపోర్ట్ ఫార్మసిస్ట్, సైకియాట్రిక్ ఫార్మసిస్ట్, హైపర్‌టెన్షన్ ఫార్మసిస్ట్, డయాబెటిక్ ఫార్మసిస్ట్, డ్రగ్ ఇన్ఫర్మేషన్ ఫార్మసిస్ట్‌గా ఉద్యోగాలు పొందుతారు.

క్లినికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌ఓ)లో క్లినికల్ ట్రైల్స్ ఆర్గనైజర్, ఫీజిబిలిటీ స్టడీస్ ప్రోటోకాల్ డెవలప్‌మెంట్, కేస్ రిపోర్ట్ ఫామ్ రివ్యూ అండ్ డిజైనింగ్, ఏడీఆర్ రిపోర్టింగ్, పేషంట్

మానిటరింగ్, బయో అనలిటికల్ స్టడీస్, బయో అవైలబిలిటీ స్టడీస్, డేటా మేనేజ్‌మెంట్ ఫర్ గ్లోబల్ ట్రైల్స్, క్లినికల్ టాక్సికాలజీ, ఫార్మాథెరాప్యుటిక్స్ వంటి విభాగాల్లో అవకాశాలు ఉంటాయి.

ఈ కోర్సు పూర్తి చేసి ఉన్నత విద్య, పరిశోధనపై ఆసక్తి ఉన్న విద్యార్థులు పీహెచ్‌డీ వైపు తమ దృష్టిని సారించవచ్చు.

బీ-ఫార్మసీ

ఇది నాలుగు సంవత్సరాల వ్యవధి ఉన్న కోర్సు. ఇంటర్మీడియట్, (ఎంపీసీ, బైపీసీ), డీ-ఫార్మసీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సుకు అర్హులు. ఆంధ్రప్రదేశ్‌లో 128, తెలంగాణలో 175 కాలేజీలు బీ-ఫార్మసీ అందిస్తున్నాయి. ఇందులో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ ఫార్మకాలజీ, పాథోఫిజియోలజీ, ఫార్మాస్యూటిక్స్, హెల్త్ ఎడ్యుకేషన్, ఫార్మకాగ్నసీ, బయోకెమిస్ట్రీ, ఫార్మా మేనేజ్‌మెంట్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మా ఇంజినీరింగ్, ఫార్మా జూరిస్, ఫార్మా ప్రాక్టీస్, హాస్పిటల్, ఫార్మసీ కమ్యూనిటీ ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీ లాంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తారు. వీరు మూడో సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం మధ్యకాలంలో సుమారు 250 గంటలు ఔషధ తయారీ కర్మాగారాల్లో శిక్షణ పొందాలి. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ, ప్రాక్టీస్ సెట్టింగ్, ఇతర ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీలో ఉద్యోగం సంపాదించినవారికి రోగులతోకానీ, డాక్టర్లతో గానీ ప్రత్యక్ష సంబంధాలు ఉండవు. వీటిలో రిసెర్చ్, డెవలప్‌మెంట్ కింద డ్రగ్ డిస్కవరీ, ఫార్ములేషన్ ప్రాసెస్, డెవలప్‌మెంట్ స్టెబిలిటీ టెస్టింగ్, ప్యాకేజింగ్ డెవలప్‌మెంట్ వంటి విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. రిసెర్చ్ అసోసియేట్, రిసెర్చ్ ఎగ్జిక్యూటివ్, రిసెర్చ్ సైంటిస్ట్, రిసెర్చ్ డైరెక్టర్, రిసెర్చ్ డెవలప్‌మెంట్ మేనేజర్ వంటి ఉన్నతమైన ఉద్యోగాల్లోనూ స్థిరపడవచ్చు.

ఉన్నత విద్య: బీ-ఫార్మసీ తర్వాత భారతదేశంలో ఎం-ఫార్మసీ, ఫార్మా-డీ (పీబీ), ఎంబీఏ వంటి ఉన్నత విద్య కోర్సులను చేయవచ్చు. జీఆర్ఈ, జీమాట్, ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణుల వడం ద్వారా విదేశాల్లో ఉన్నత శ్రేణి ఫార్మసీ విద్యను అభ్యసించవచ్చు. ఆసక్తి ఉన్నవారు ఫార్మా-డీ కూడా చేయవచ్చు. క్లినికల్ విభాగంపై అవగాహన, పట్టు ఉన్న విద్యార్థులు బీ-ఫార్మసీ అయిన తర్వాత 3 సంవత్సరాల ఫార్మా-డీ (పోస్ట్ బ్యాచ్‌లరేట్ కోర్స్)ను చేయవచ్చు. కళాశాలకు 10 సీట్లు చొప్పున ఔషధ మండలి వీరికి సీట్లను కేటాయిస్తుంది.

ఎం-ఫార్మసీ: బీ-ఫార్మసీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు గ్యాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ జీప్యాట్ ద్వారా దేశంలోని ఏదైనా ఫార్మసీ కళాశాలలో ఎం-ఫార్మసీలో ప్రవేశం పొందవచ్చు. లేదా రాష్ట్రస్థాయి పీజీఈసీఈటీ ద్వారా రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల్లో ఎం-ఫార్మసీలో చేరవచ్చు. జాతీయస్థాయి ఎన్ఐపీఈఆర్ అర్హత పరీక్ష ద్వారా, దేశంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్, రిసెర్చ్ (ఎన్ఐపీఈఆర్) విద్యాసంస్థల్లో ప్రవేశం పొందవచ్చు. జీఆర్ఈ, ఐఈఎల్‌టీఎస్, ఎన్ఏపీఎల్ఈఎక్స్, టోఫెల్ వంటి అర్హత పరీక్షల ద్వారా విదేశాల్లో ఎంఎస్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కోర్సును పూర్తి చేయవచ్చు. క్యాట్, ఐసెట్ అర్హత పరీక్షల ద్వారా ఎంబీఏను కూడా అభ్యసించవచ్చు. వీరు ఎంచుకునే ప్రత్యేక విభాగాలను బట్టి ఆయా విభాగాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మన దేశంలో భారత ఔషధ మండలి ప్రకారం 12 విభాగాల్లో ఎం-ఫార్మసీలో ప్రవేశం లభిస్తుంది. ఫార్మాస్యూటిక్స్, ఫార్మా కెమిస్ట్రీ, ఫార్మాఅనాలిసిస్, ఫార్మకాలజీ, ఫార్మకాగ్నసీ విభాగాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

ఉపాధినిచ్చే రంగాలు

ప్రొడక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్: బల్క్ డ్రగ్స్ తయారీ, ఔషధాలు, టీకాల తయారీ, జీవ ఔషధ ఉత్పత్తుల తయారీ, వైద్య పరికరాల తయారీ, పశు సంబంధిత ఔషధాల తయారీ.

ప్యాకేజింగ్: ఔషధ ఉత్పత్తిలో పలు దశలు, వాటి ప్యాకింగ్.

క్వాలిటీ కంట్రోల్: ఔషధాల తయారీలో ఉత్పత్తయిన ఔషధాల నాణ్యతా ప్రమాణాలను పాటించడం, ప్రొడక్ట్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్, ప్రొడక్షన్ మేనేజర్, డైరెక్టర్ - ఈ విధులను ఫార్మసీ నిపుణులే నిర్వహిస్తారు.

క్వాలిటీ అస్యూరెన్స్: ఔషధాలకు, వాటి తయారీకి సంబంధించిన డాక్యుమెంట్లను తయారుచేయడం, పరిశీలన, తర్వాత సంబంధిత శాఖలకు సమర్పించడం, ఔషధాల నాణ్యతను పాటించడానికి తగిన శిక్షణ, ఇంటర్నల్ ఆడిటింగ్ వంటివి ఈ శాఖకు సంబంధించినవి.

సేల్స్, మార్కెటింగ్: ప్లానింగ్, టీమ్ మేనేజ్‌మెంట్, ఔషధాల మార్కెటింగ్, ఎంట్రీ లెవల్, రిప్రజెంటేటివ్, టెరిటరీ మేనేజర్, ఏరియా మేనేజర్, జోనల్ మేనేజర్, రీజనల్ మేనేజర్, నేషనల్ సేల్స్ మేనేజర్, జనరల్ మేనేజర్ (సేల్స్, మార్కెటింగ్) వంటి వివిధ శాఖల్లో ఉద్యోగాలను ఎంచుకోవచ్చు.

ఎగ్జిక్యూటివ్: ఎంట్రీలెవల్, మేనేజ్‌మెంట్ ట్రెయినీ, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్, ప్రోడక్ట్ మేనేజర్, గ్రూప్ ప్రోడక్ట్ మేనేజర్ వంటి స్థాయుల్లో పలు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

రెగ్యులేటరీ అఫైర్స్ (మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్): మేనేజ్‌మెంట్ ట్రెయినీ, అసిస్టెంట్ మేనేజర్, కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్, రీ-ప్యాకింగ్ మాన్యుఫ్యాక్చరర్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, ప్రభుత్వ అనలిస్ట్, అనలిటికల్ కెమిస్ట్, మాన్యుఫ్యాక్చరింగ్ కెమిస్ట్ వంటి అవకాశాలు ఉన్నాయి.

విద్యా రంగం, క్లినికల్ రిసెర్చ్ (స్పెషలైజేషన్‌తో కూడినవి) వంటి వాటిలో కూడా ఆకర్షణీయమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ఉద్యోగావకాశాలు

భారతదేశంలో ఫార్మసీ విద్య చదివినవారికి ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫార్మసీ పూర్తి చేసినవారికి ఉద్యోగ భద్రతతో పాటు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఆకర్షణీయమైన వార్షికాదాయంతో ఉద్యోగాలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పాలి. వీరి వార్షికాదాయం కూడా ఆకర్షణీయంగా ఉంటుంది.

సైన్స్, హెల్త్‌కేర్, కంప్యూటర్ టెక్నాలజీ, మ్యాథ్స్, కౌన్సెలింగ్ రంగాల అనుసంధానమైన కొత్త సర్టిఫికెట్ కోర్సులతో ఫార్మసీ విద్యకు ఉపాధి అవకాశాలు ప్రపంచమంతటా విస్తరిస్తున్నాయి. విద్యార్హత, అనుభవం, ప్రతిభను బట్టి అర్హులైనవారికి మంచి ఉద్యోగస్థాయి, తగిన వేతనం లభిస్తున్నాయి.

కొన్ని ప్రధాన విభాగాలు: ■ ఫార్మసిస్ట్ (పరిశ్రమలు/ ఆసుపత్రులు/ క్లినికల్/ కమ్యూనిటీ) ■ ఫార్మకో ఎపిడిమీయోలాజిస్ట్/ డేటా అనలిస్ట్ (ప్రస్తుతం బాగా ప్రాధాన్యం కలిగింది) ■ రిటైల్/ హోల్‌సేల్ కెమిస్ట్/ డ్రగ్గిస్ట్ (వ్యాపారం) ■ రోగులకు ప్రిస్క్రిప్షన్ తయారు చేయడం (విదేశాల్లో దీనికి అత్యంత ప్రాధాన్యం ఉంది) ■ డ్రగ్ థెరపిస్ట్ ■ డ్రగ్ ఇన్స్‌పెక్టర్, అనలిస్ట్ (ప్రభుత్వ ఉద్యోగాలు) ■ ఎకడమీషియన్స్ (ఫార్మసీ టీచర్స్) ■ కెమికల్/ డ్రగ్ టెక్నీషియన్ ■ పాథోలాజికల్ లాబ్ ■ ఆర్ అండ్ డీ (బేసిక్, అప్లైడ్) ■ బయో-టెక్ పరిశ్రమలు ■ సేల్స్, మార్కెటింగ్ ■ ఫార్మాస్యూటికల్, బయో-టెక్ ఆర్ అండ్ డీ ■ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు (ప్రొడక్షన్/ క్యూఏ-క్యూసీ/ డాక్యుమెంటేషన్) ■ క్లినికల్ రిసెర్చ్ సంస్థలు ■ రెగ్యులేటరీ సంస్థలైన ఎఫ్‌డీఏ, డబ్ల్యూహెచ్ఓ, సీడీఎస్‌సీఓ ■ ప్రభుత్వ రంగ ఆర్ అండ్ డీ సంస్థలు - సీఎస్ఐఆర్, ఎన్ఐఎన్, సీసీఎమ్‌బీ, ఐసీఎమ్‌ఆర్, డీటీఏబీ, సీడీఎల్, ఏఐసీటీఈ, పీసీఐ, ఫార్మాస్యూటికల్ అసోసియేషన్స్ (ఐపీఏ, ఐపీజీఏ, ఎఫ్ఐపీ, ఏపీటీఐ మొదలైనవి).

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

1) 480 కాంట్రాక్టు ఇంజినీర్ ఖాళీలు

అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఒక ఏడాది ఇండస్ట్రియల్ అనుభవం తప్పనిసరి. **వయసు:** 26 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.06.2018

2) బెంగళూరు యూనిట్‌లో డిప్లొమా అప్రెంటిస్‌లు

స్టైపెండ్: నెలకు రూ.10,400 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత. 01.08.2015 తర్వాత డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులు. **వయసు:** 22 సంవత్సరాలకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా.

రాతపరీక్ష/ ఇంటర్వ్యూ తేదీ: 2018 జులై 13, 14

దరఖాస్తు: ఈమెయిల్ **చివరి తేదీ:** 03.07.2018

ఈమెయిల్: hrcld@bel.co.in

వెబ్‌సైట్: http://bel-india.in/

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

సంస్థ: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)
సదరన్ రీజియన్, చెన్నై

పోస్టులు: జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్

ఖాళీలు: 186 **అర్హత, వయసు:** ఏఏఐ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

వెబ్‌సైట్: https://www.aai.aero/en

ప్రవేశాలు

నవోదయ విద్యాలయ సమితి

నవోదయ విద్యాలయ సమితి 2018-19 విద్యా సంవత్సరానికిగానూ దేశంలోని వివిధ జవహర్ నవోదయ విద్యాలయాల్లో పదకొండో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **విభాగాలు:** సైన్స్, హ్యూమానిటీస్, కామర్స్, ఒకేషనల్. **అర్హత:** 2017-18 విద్యా సంవత్సరంలో పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు. **వయసు:** 01.06.2000 నుంచి 31.05.2004 మధ్య జన్మించి ఉండాలి. **ఎంపిక:** పదోతరగతి మార్కుల ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్

చివరి తేదీ: 05.07.2018

వెబ్‌సైట్: http://navodayahyd.gov.in/

ఏపీ వర్సిటీల్లో ఇండో-స్వీడిష్ బీటెక్ ప్రోగ్రామ్

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ వర్సిటీలు స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) భాగస్వామ్యంతో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి. **కోర్సు ప్రత్యేకత:** నాలుగేళ్ల బీటెక్ కోర్సులో భాగంగా 3 సంవత్సరాలు ఇండియాలో, ఒక సంవత్సరం స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. **అందిస్తున్న ఏపీ వర్సిటీలు:** జేఎన్‌టీయూ కాకినాడ (60 సీట్లు), శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (30), జేఎన్‌టీయూ అనంతపురం (30), శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (30 సీట్లు). **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. **ఎంపిక:** ఐఐటీ జేఈఈ మెయిన్/ ఏపీ ఎంసెట్/ టీఎస్ ఎంసెట్/ ఇంటర్ మార్కుల ఆధారంగా. దరఖాస్తు విధానం, చివరి తేదీ, ఇతర వివరాలు ఆయా యూనివర్సిటీల అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి.

ఎన్‌సీఏఓఆర్, గోవా

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సంస్థ: నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రిసెర్చ్ (ఎన్‌సీఏఓఆర్), గోవా. **పోస్టులు:** మెడికల్ ఆఫీసర్, ఎంటీఎస్, కుక్, వెల్డర్, మెకానిక్ తదితరాలు. **ఖాళీలు:** 32 **అర్హత, వయసు:** ఎన్‌సీఏఓఆర్ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **ఇంటర్వ్యూ తేదీ:** మెడికల్ ఆఫీసర్ పోస్టులకు జులై 4, మిగిలినవాటికి జులై 10 నుంచి 13 వరకు.

వేదిక: మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎన్‌సీఏఓఆర్, వాస్కోడగామా, గోవా. మిగిలినవాటికి మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, ఐఎండీ క్యాంపస్, లోధి రోడ్, న్యూదిల్లీ.

వెబ్‌సైట్: http://ncaor.gov.in/recruitment

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సు చేయాలంటే..?

ఇంటర్ తరువాత ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదవాలంటే ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకుంటే మంచిది? ఈ కోర్సు గురించిన పూర్తి సమాచారాన్ని అందించండి.

- రాజు.పి, జై, వైవీఎన్ఎం సత్యనారాయణ

పర్యావరణ భౌతిక, రసాయన, జీవ సంబంధిత భాగాలను పరస్పరం అధ్యయనం చేసే విజ్ఞానశాస్త్రమే ఎన్విరాన్‌మెంటల్ సైన్స్. ఇది జీవ, రసాయనిక, భూగోళశాస్త్రాల కలయిక. అందుకే దీన్ని ఇంటర్ డిసిప్లినరీ ఫీల్డ్‌గా పరిగణిస్తారు. ఈ శాస్త్రం సాంఘిక, మానవీయ శాస్త్రాలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. బీఎస్‌సీ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) మాత్రమే కాకుండా ఈ రంగంలో బీటెక్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్)ను కూడా ఇంటర్ తరువాత ఎంచుకోవచ్చు.

ఇంటర్‌లో ఎంపీసీ/ బైపీసీ ఏదైనా ఎంపిక చేసుకోవచ్చు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్/ టెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే ఎంపీసీ ఎంచుకోవడం మంచిది. జీవశాస్త్ర కలయిక కోసం బైపీసీ ఎంచుకోవడం శ్రేయస్కరం. బీఎస్‌సీ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) లేదా బీటెక్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్) రెండింటికీ కూడా చక్కని భవిష్యత్తు ఉంది. ప్రతిష్ఠాత్మక ఐఐటీ- ఖరగ్‌పూర్, ఐఐటీ-ఖాన్‌పూర్, ఐఐటీ-దిల్లీ, ఐఐటీ-రూర్కీ, ఐఐటీ-బాంబేల్లో బీటెక్‌లో ఈ కోర్సును అందిస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆధారంగా ప్రవేశాన్ని కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో బీఎస్‌సీ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌ను ఆల్ ఆమీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- రాజమండ్రి, శ్రీ గ్రంథి చిన సన్యాసి రాజు కాలేజ్- శ్రీకాకుళం, హోమ్‌సైన్స్ కాలేజ్- హైదరాబాద్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ విమెన్- హైదరాబాద్, ఆంధ్రా, కాకతీయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్నాయి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్